విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 26 | జూన్ | 2025 8 పేజీలు

కర్షకులకు సర్వే కష్టాలు...

- భూమి విస్తీర్ణంలో తేడాలు...
- సంక్షేమ పథకాలకు దూరమవుతున్న అర్హులు



"ఫలానా భూమి ఓ వ్యక్తిది అని చెప్పడానికి ఇప్పటివరకు ఉన్న పద్ధతి సర్వే నెంబరు విధానం. ఒక సర్వే నంబరులో ఎక్కువమందికి భూమి ఉంటే ఆ సర్వే నెంబరు ను సబ్ డివిజన్ చేసి గుర్తింపు ఇచ్చేవారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూ.. రీసర్వేలో మాత్రం రెండు, మూడు సర్వే నెంబర్లకు కలిపి ఓ జాయింట్ ల్యాండ్ పార్సిల్ నెంబర్ (ఎల్. పి.ఎం.) ఇచ్చారు. సబ్ డివిజన్ చేయకుండా నాడు చేసిన తప్పు మూలంగా ఇప్పుడు ఆ పార్సిల్ నెంబర్‌లోని భూమి మొత్తం అందులోని రైతుల అందరి పేర్లపై చూపిస్తోంది. అంటే ఎకరం భూమి కలిగిన రైతుకు కూడా ఎక్కువ భూమి చూపిస్తోంది.ఇది రైతాంగానికి పెద్ద తలనొప్పిగా మారింది.గత ప్రభుత్వంలో చేసిన తప్పిదం మూలంగా ఇప్పుడు రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. దీంతో అర్హులైన రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు."

విశాలాంధ్ర బ్యూరో ఏలూరు: వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే చేపట్టిన సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా గడువు విధించి సర్వే పూర్తి చేయించారు. దీని మూలంగానే తప్పులు లేకుండా చేయాల్సిన రీసర్వేలో అనేక కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి.ఒక సర్వే నెంబర్లో సబ్ డివిజన్ కింద భూమి ఉన్నప్పుడు కొత్తగా చేసే రీసర్వేలో కూడా ఆ భూమికి సబ్ డివిజన్ చేసి ఎల్.పి.ఎం. నెంబర్ కేటాయించాలి. కొన్ని చోట్ల అలా జరగలేదు. ఒక సర్వే నెంబర్లోని రైతు రీసర్వే సమయంలో రాకపోతే ఆ సర్వే నెంబర్లోని సబ్ డివిజన్లను అన్నింటినీ కలిపి ఒక జాయింట్ ల్యాండ్ పార్శిల్ కిందకు తీసుకొచ్చారు. పోనీ ఈ తప్పును ఆ తర్వాత సరి చేశారా అంటే అదీ లేదు. రైతులు గగ్గోలు పెట్టినా గత ప్రభుత్వంలో పట్టించుకున్న నాథుడే లేడు.

ప్రభుత్వం మారడంతో చిగురించిన రైతుల ఆశలు...

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఇక్కడ రీసర్వేకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా రావడంతో మరోసారి రి సర్వే జరిగిన గ్రామాలలో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించారు. అప్పుడు ▶మిగతా 2లో..

దివ్యాంగులు జీవితంలో స్థిరపడాలి :కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ నిరుద్యోగ యువతీ, యువకులకు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఎంపికైన వారు ఉద్యోగాలలో స్థిరపడి మంచిగా జీవనం కొనసాగించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆర్.ఆర్.డి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ, నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు నిర్వహించిన మెగా ఉద్యోగ మేళ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూత్ ఫర్ జాబ్ ఫౌండేషన్, రెడ్డి ఫౌండేషన్ వారు ఈ ఉద్యోగ మేళాలో అర్హతల మేరకు యువతీ యువకులను ఎంపిక చేసి రెండు నెలలు పాటు శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగ నియామకాలు చేపడతారన్నారు. చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వికలాంగ యువతీ, యువకులకు శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పించడం చాలా గొప్ప విషయం అన్నారు. ముందుగా ఈ జాబ్ మేళాకు హాజరైన ▶మిగతా 2లో..

నేడు కేంద్రమంత్రి, డిప్యూటీ సీఎం రాక

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్ హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం , పోలీసు వ్యవస్థ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు అధికారులను జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అఖండ గోదావరి తదితర ప్రాజెక్టుల నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ తో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ... గురువారం ఉదయం పుష్కర ఘాట్‌లో అఖండ గోదావరి ప్రాజెక్టు కు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అనంతరం బొమ్మూరు లోని సైన్స్ మ్యూజియాన్ని మంత్రులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభిస్తారన్నారు. అనంతరం దివాన్ చెరువులో అటవీ అకాడమీ భవనానికి శంకుస్థాపన చేస్తారని తెలియజేశారు. ఉప ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇతర మంత్రుల, ప్రజా ప్రతినిధులు పర్యటన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎవరికి కేటాయించిన బాధ్యతను వారు సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యావరణ హితంగా కార్యక్రమాన్ని ప్లాస్టిక్ రహితంగా నిర్వహించాలని, మంచినీటికి ప్లాస్టిక్ సీసాలను వినియోగించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆర్ ఎమ్ సి అధికారులకు ▶మిగతా 2లో..

• మెడికల్ మాఫియా..

- ఇంగ్లీష్ మెడికల్ షాపులలో జనరిక్ మందుల విక్రయాలు..
- రోగులను దోచుకుంటున్న వైనం

విశాలాంధ్ర- కొవ్వూరు : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కొవ్వూరులో విచ్చలవిడిగా మెడికల్ మాఫియా నడుస్తోంది. కొవ్వూరులో కార్యాల యంలో ఉంటున్న డ్రగ్ ఇన్స్పెక్టర్ ఏ రోజు తనిఖీలకు వెళ్లిన పాపాన పోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో మెడికల్ షాపుల వారు ఇష్టానుసారంగా విక్రయాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. తెలిసిన వాళ్ళకి ఒరిజినల్ మందులు ఇస్తూ, తెలియని వారికి జనరిక్ మందులు ఇస్తూ మోసానికి పాల్పడుతున్న షాపుల యజమానులు. వాస్తవానికి కొవ్వూరులో రెండు మూడు చోట్ల ప్రత్యేక జనరిక్ మందుల షాపులు ఉన్నాయి. అయితే వారు సరసమైన ధరలకు విక్రయిస్తుంటే ఇంగ్లీష్ మెడికల్ షాపుల వారు దానికి రెట్టింపు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జనరిక్ మందుల షాపులలో ఎమ్మార్పీ ధరలు అధికంగా ఉంటాయి. అయినా వారు కంప్యూటర్లో ధరలనుచూసి చూసి విక్రయిస్తున్నారు. ఇంగ్లీష్ మందుల షాపుల వారు రోగులు ఏవరైనా అడిగితే దానిమీద ఎమ్మార్పీ ఎంత ఉందో చూసుకోండి మేము ధరలను తగ్గించి అమ్ముతున్నాం అని నమ్మపలుకుతున్నారు. ఒకవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జనరిక్ మందుల దుకాణాలను ప్రోత్సహిస్తుంటే డ్రగ్ ఇన్స్పెక్టర్లు మాత్రం ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా మామూలు మత్తులో జోగుతున్నారు.

ఇంగ్లీష్ మందుల షాపులలో మరో మోసం?.

ఇదిలా ఉండగా ఇంగ్లీష్ మందుల షాపులలో ప్రముఖ కంపెనీలు అయిన రెడ్డి ల్యాబ్, సన్ ఫార్మసిటికల్ వంటికంపెనీల మందులు ఉంటాయి. అయితే తెలియని వారు వచ్చినప్పుడు అవే కాంబినేషన్లో చిన్న కంపెనీలకు చెందిన మందులను విక్రయిస్తున్నారు. పెద్ద కంపెనీ మందులలో వచ్చే లాభం కంటే చిన్న కంపెనీల మందులలో లాభాలు మెండుగా ఉంటాయి. దీంతో కొనుగోలు దారులు తమ చేతితో మందుల ఖాళీ అట్టలు తెచ్చి ఈ రకమే ఇవ్వండి అని అడుగుతుంటే టాబ్లెట్ మందులో ఉన్న కాంబినేషన్ ఒకటే మీరు అడిగినవి మా దగ్గర లేదు. కావాలంటే తెప్పిస్తాం అని సమాధానం ఇస్తున్నారు. అసలే బాధలో ఉన్న రోగులు ఎప్పుడు తెప్పిస్తారో అని వేచి చూడలేక మందుల షాపుల వారు ఇచ్చే మందులనే వాడుతున్నారు.

నిన్నటి వరకు ఇవ్వని డిస్కౌంట్‌లో నేడు..

నిన్న మొన్నటి వరకు మందుల అట్టలపైఉన్న ఎమ్మార్పీ ధరలు వసూలు చేసిన కొవ్వూరు మందులు షాపులు యజమానులు ..దిగివచ్చారు. దీనికి కారణం కొవ్వూరులో అపోలో ఫార్మసీ, మెడిప్లస్వంటి షాపులు ఏర్పాటు చేసి విక్రయ దారులకు పది నుండి 20% కమిషన్ ఇవ్వడంతో ఈ మందుల షాప్ సిండికేట్లు దిగివచ్చి వారు టెన్ పర్సెంట్ డిస్కౌంట్ ఇస్తున్నారు. ఇప్పటివరకు వారంతా ఏవిధంగా అధికంగా వసూలు చేశారో మనం ఇట్టే అర్ధం చేసుకోవచ్చు. నిన్న మొన్నటి వరకు కోరు మందుల షాపులు యజమానులు సిండికేట్ గా మారి మందులు అట్టలపై ఉన్న ఎంఆర్పీ రేట్లు ముక్కుబండి వసూలు చేసేవారు. ఇప్పటికైనా డ్రగ్ ఇన్స్పెక్టర్ క్షేత్రస్థాయిలో మందుల దుకాణాలను తనిఖీ చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సర్వే కష్టాలు... (1వ పేజీ తరువాయి)

రీ సర్వేలో జరిగిన తప్పులను సరి చేయాలంటూ రైతుల నుంచి అర్జీలు వచ్చాయి. ఈ ఏడాది కాలంలో ఒక సర్వే శాఖకు సంబంధించినవే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వందల కొలది అర్జీలు నమోదు కావడం గమనార్హం.

నూతన మార్గదర్శకాలు : జాయింట్ ల్యాండ్ పార్సిల్ సమస్యలే కాకుండా..భూ విస్తీర్ణంలో తేడాలు వచ్చిన కేసులు కూడా వేలల్లోనే ఉన్నాయి.వీటన్నింటి పరిష్కారానికి ప్రభుత్వం గైడ్ లైన్స్ రూపొందించింది. జాయింట్ ల్యాండ్ పార్సిల్ నుంచి సబ్ డివిజన్ చేయాలంటే జాయింట్ కలెక్టర్ స్థాయి వరకు ఫైల్ నడవాల్సి రావడంతో ఒక పట్టాన సమస్య పరిష్కారం అయ్యేది కాదు. అధికారులు కూడా సమస్య పరిష్కరించకుండానే అర్జీలను క్లోజ్ చేస్తూ వచ్చారు.

ప్రభుత్వ కీలక నిర్ణయం : ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వేలో సబ్ డివిజన్ జరగకుండా ఇబ్బందులు పడుతున్న రైతులు లక్షల్లో ఉండడంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాయింట్ ల్యాండ్ పార్సిల్ నుంచి సబ్ డివిజన్ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టింది. గతంలో మాదిరిగా కాకుండా ఈ సబ్ డివిజన్ ప్రక్రియ సర్వేయర్ స్థాయిలోనే పూర్తిచేసేలా నిర్ణయించారు. అలానే ఇందుకు దరఖాస్తు రుసుము రూ.500 ఉండగా,దానిని రూ.50కు తగ్గించారు. సబ్ డివిజన్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు స్థానిక సచివాలయాల లో ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

డిప్యూటీ సీఎం రాక (1వ పేజీ తరువాయి)

సూచనలు చేయడం జరిగింది. పుష్కర ఘాట్ లో ఈతగాళ్లను, రెస్క్యూ బోట్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఎలక్ట్రిక్ సేఫ్టీ సర్టిఫికెట్లను, డిజాస్టర్ సేఫ్టీ సర్టిఫికెట్లను తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ... భద్రత విషయంలో పోలీసు అధికారులు చేపట్టే పటిష్ట భద్రత ఏర్పాట్లకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ టి. సీతారామమూర్తి, అడిషనల్ ఎస్పీ డి. మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ శరత్ కుమార్, ఆర్డీవో ఆర్ . కృష్ణ నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రభాకర్ రావు, ఎస్ డి సి గెయిల్ ప్రేమ్ కుమార్, ఏపీ కాస్ట్ డైరెక్టర్ డాక్టర్ పి ఎస్ శ్రీనివాస్ బాబు, టూరిజం అధికారి పి వెంకటాచలం, డీఎంహెచ్వో, ఎస్ ఈ ఆర్ అండ్ బి, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థిరపడాలి (1వ పేజీ తరువాయి)

యువతీ, యువకుల పేర్లు, వారి విద్యార్హతలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగాలు సాధించి తాము కూడా సమాజానికి సేవ చేస్తున్నామనే భావం వారికి కలుగుతుందన్నారు. దివ్యాంగ నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో ఏమైనా ఇబ్బందులు ఉన్నా, ప్రభుత్వ పరంగా ఏమైనా సహాయం కావాలన్నా చేయడానికి ప్రభుత్వం యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఉద్యోగ మేళాకు మొత్తం 65 మంది పాల్గొనగా 45 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ పి.లోకమాన్ కలెక్టర్ చదలవాడ నాగరాణికి వివరించారు. కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి అధికారి పి.లోకమాన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన, నేషనల్ కెరియర్ సర్వీస్ ప్రతినిధి ఎం.కిషోర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ రమణరాజు, హెచ్ ఆర్ లు, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించాలి

విశాలాంధ్ర- పాలకోడేరు : పౌర సరఫరాల కమిషనర్ ఆదేశానుసారం గురువారం ఉదయం నుంచి ఈనెల 30వ వరకు 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు, బెడ్ మీద ఉన్న పేషెంట్లకు ఇంటి వద్దనే నిత్యవసర సరుకులు అందించాలని మండల తహసిల్దారు ఎన్. భారతి విజయలక్ష్మి మండలంలోని రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం స్థానిక తహసిల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు తూచ తప్పకుండా పాటించాలని వృద్ధులకు వికలాంగులకు, బెడ్ మీద ఉండే రోగులకు వారి ఇంటి వద్దకే నిత్యవసర సరుకులు అందించే ప్రక్రియ అత్యంత ఆదర్శకంగా చేపట్టాలని దీనికి గాను ప్రతి రేషన్ షాపుకు ఒక జి ఎస్ డబ్ల్యూ ఎస్ ఉద్యోగిని నియమించి ఈ యొక్క ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా పర్యవేక్షించవలసి ఉంటుంది అన్నారు. ఈ యొక్క సమావేశంలో ఆమెతో పాటు డిటి, సివిల్ సప్లై డీటీ, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : శాసనసభ్యుల ఆదేశాల మేరకు కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం అని ఎంపీడీవో కిరణ్ కుమార్ పేర్కొన్నారు. పరింపూడి గ్రామపంచాయతీ, రెవెన్యూ పరిధిలో గల చేపల వారి వీధి శివారున గత వైసీపీ ప్రభుత్వంలో 188 మంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని, ఇల్లు నిర్మించుకోవడానికి కాలనీ కూడా మంజూరు అయిందని,అక్కడ ఇళ్ల స్థలాలు వచ్చిన కుటుంబాల వారు ఇల్లు నిర్మించుకోవడానికి నీరు, రోడ్లు, విద్యుత్, సరైన వసతులు లేక ఇల్లు నిర్మించు కోలేకపోతున్నామని తమ సమస్యను పరిష్కరించాలని, తమ కాలనీని అభివృద్ధి చేయాలని శాసన సభ్యుల వారికి ఆయన కార్యాలయం వద్ద వినతి పత్రాన్ని అందజేయడంతో శాసనసభ్యులు చిర్రి బాలరాజు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్ కు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం ఎంపీడీవో కిరణ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో సతీష్, పంచాయతీ కార్యదర్శి సురేష్,లు కాలనీ వద్దకు చేరుకుని కాలనీని పరిశీలించి, కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి యొక్క సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తామని తెలిపారు.కాలనీని పరిశీలించిన వారిలో సూర్య, సచివాలయ సిబ్బంది, ఉన్నారు.

లోక్ అదాలత్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

విశాలాంధ్ర - నరసాపురం : జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ పై ప్రత్యేక దృష్టి సారించాలని నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి. గంగ రాజు అన్నారు. కోర్ట్ హాల్ లో బుధవారం పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కక్షిదారులకు సమ న్యాయం అందించుటలో పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాజీ చేయడానికి వీలుపడే కేసులను ముందుగా గుర్తించి ఇరుపార్టీలకు నోటీసులు ఇచ్చి కౌన్సెలింగ్ ఇవ్వడం వల్ల కొన్ని కేసులను రాజీ చేయవచ్చునన్నారు.లోక్ అదాలత్ ప్రాముఖ్యతను, ముఖ్యోద్దేశం కక్షిదారులకు వివరించాలని, ఇప్పటికే గ్రామాలలో పారా లీగల్ వాలంటీర్స్ ద్వారా లోక్ అదాలత్ ప్రాముఖ్యతను తెలియజేయడం జరుగుతుందన్నారు. గతంలో కంటే ఎక్కువ కేసులు రాబోయే జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయవలసినదిగా పోలీస్ అధికారులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్. వరలక్ష్మి, గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్, , ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఖాసీం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్దార్థ, నర్సాపురం టౌన్, రూరల్ , మొగల్తూరు, యలమంచిలి, స్టేషన్లు కు సంబంధించిన పోలీస్ అధికారులు నర్సాపురం కోర్ట్ లైజన్ అధికారి సూర్య భాస్కర్ రావు ఆయా పోలీస్ స్టేషన్ లకు చెందిన కోర్ట్ ప్రతినిధులు హాజరైనారు .

జాతీయ స్థాయిలో శ్రీ చైతన్య ర్యాంకులు

విశాలాంధ్ర - గణపవరం: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షలలో గణపవరం శ్రీ చైతన్య విద్యా సంస్థ విద్యార్థుల ప్రతిభను సాధించినట్లు శ్రీ చైతన్య విద్యాసంస్థ ప్రిన్సిపాల్ పి రామ్ ప్రకాష్ బుధవారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో గణపవరం శ్రీ చైతన్య విద్యాసంస్థ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపర్చి అనేక విలువైన బహుమతులు కైవసం చేసుకొన్నారని ఆయన తెలిపారు.జాతీయ ప్రధమ బహుమతిగా లెనోవో టాబ్, గోల్డ్ మెడలను విద్యార్థులు ఆర్. యశస్వినీ అంజన, జె. ద్రాక్షన్య దుర్గ సాధించారు. అదేవిదంగా ద్వితీయ బహుమతిగా స్మార్ట్ వాచ్, గోల్డ్ మెడల్స్ డి షర్మిల, ఎమ్. సత్యసాత్విక సాధించారు. వీరితో పాటు అనేకమంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ తో పాటు అనేక విలువైన బహుమతులు గెలిచారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.ఏజియమ్ పార్ధసారధి. కో ఆర్డినేటర్ ఎ. రామారావు, డీన్ పి. ఏసుబాబు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడండి

విశాలాంధ్ర -ముసునూరు: రైతులు సకాలంలో తమ భూములకు భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా లోపాలను గుర్తించి అవసరమైన ఎరువులు వాడకం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారిని చాముండేశ్వరి అన్నారు. బుధవారం ముసునూరు మండలంలోని చెక్కపల్లి ,గోగులంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సీజన్లో ప్రధాన పంటసాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని దానిని పూత దశలో భూమిలో కలియదున్నడం ద్వారా భూమికి కావలసిన పోషకాలు అంది భూసారం పెరగడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు. అలాగే రసాయనక ఎరువులు వాడవలసిన అవసరం కూడా ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పచ్చిరొట్ట విత్తనాలు చలన వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు అలాగే కౌలు రైతులు రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బందికి పత్రాలు అందజేసి సకాలంలో కౌలు కార్డులు తీసుకోవడం ద్వారా రుణాలు కూడా పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెక్కపల్లి రైతులు ప్రభాకర్, కిషోర్, అలాగే గోగులం పాడు రైతులు పాలడుగు నాగం బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

విశాలాంధ్ర,ద్వారకాతిరుమల: రైతులు పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని ద్వారకాతిరుమల వ్యవసాయాధికారి ఎస్. చెన్నకేశవులు అన్నారు. ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి. మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, వివిధ రకాల పంటలలో వచ్చే చీడపీడల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఘంటా శ్రీనివాసరావు రామ్మోహనరావు, గరిమెళ్ల రాంబాబు, ఆచంట సత్యనారాయణ. కుంచం చంటి ఏపూరి కిషోర్,త దితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇళ్ల వద్దకే సరుకులు

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో 65 ఏళ్లు పైబడి ఉన్న 70,770 రేషన్ కార్డుదారులకు జూలై నెలకు సంబంధించిన నిత్యావసర సరుకులు ముందస్తుగానే నేడు గురువారం నుంచి 30 సోమవారం వరకు ఇంటి వద్ద పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ తెలిపారు. కార్డుదారులు ఈ అవకాశమును సద్వినియోగ పరుచుకొనవలసినదిగా ఆమె విజ్ఞప్తి చేశారు.

వినాయక ప్రసాద్ అరెస్ట్ .. 14 రోజులు రిమాండ్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ అందించాల్సిన కోచ్ కీచకుడిగా మారి బాలికలను లైంగికంగా వేధిస్తుండడంతో మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న టూటౌన్ పోలీసులు కోచ్ వినాయక ప్రసాద్ ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా అతనికి న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు నగరంలోని ఏఎస్ఆర్ స్టేడియంలోని శాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) నిర్వహణలోని ఎస్టిసి సెంటర్ హాస్టల్లో ఉండి స్థానిక ఏఆర్డిజికె పాఠశాలలో 10వ తరగతి చదువుతూ అథ్లెటిక్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థినులపై, హాస్టల్ ఇన్‌చార్జ్ మరియు హెడ్ కోచ్ దూలం నాగేంద్ర వెంకట వినాయక ప్రసాద్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతో పలువురు క్రీడాకారులు బెంగళూరులోని శాయ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గత వారం రోజుల క్రితం ఏలూరు చేరుకున్న శాయ్ అధికారులు వినాయక ప్రసాద్ పై అంతర్గత విచారణ నిర్వహించారు. లైంగిక వేధింపులకు గురైన బాలికల నుండి వివరాలు అడిగి తెలుసుకుని ప్రసాద్ పై వచ్చిన ఆరోపణలు నిజమేనని నిర్ధారించుకొని వేధింపులకు గురైన బాధిత బాలికతో వినాయక ప్రసాద్ పై ఏలూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో 22 ఫిర్యాదు చేయించారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో 2 టౌన్ సిఐ కె.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా ఎస్సై కళ్యాణి కేసు నమోదు చేసి దర్యాప్తు ఆరంభించారు. అయితే పరారీలో ఉన్న నిందితుడు ప్రసాద్ కోసం విస్తృత గాలింపు చర్యలు చేపట్టి ఈ నెల 24వ తేదీన ప్రసాద్ ‌న అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. మైనర్ బాలికలు, మహిళల పట్ల వేధింపులకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని సిఐ అశోక్ కుమార్ హెచ్చరించారు. ఎవరైనా వ్యక్తులు ఇటువంటి వేధింపులకు పాల్పడితే వెంటనే 100, 112 లేదా 1930 నెంబర్లకు ఫోన్ చేస్తే తక్షణ పోలీసు సహాయం అందిస్తామని సిఐ అశోక్ స్పష్టం చేశారు.

విద్యార్థులకు ప్రత్యేక బస్సు

విశాలాంధ్ర -ముసునూరు: మండలంలోని గుడిపాడు, గుల్లపూడి, వలసపల్లి ,చెక్కపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు చొరవతో ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయించినట్లు మండలంలోని పలు పాఠశాలల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న గుడిపాడు గ్రామస్తుడు రామారావు అన్నారు. ఈ బస్సును ఏర్పాటు చేయడం వలన పలు గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు సకాలంలో విద్యా సంస్థలకు వెళ్లి విద్యను అభ్యసించేందుకు వీలవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు ఆయా గ్రామాల ప్రజల అభ్యర్థన మేరకు ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ అయిన రెడ్డి అప్పలనాయుడు కి వినతి పత్రం అందించి, విద్యార్థుల అవస్థలను వివరించగా ఆయన వెంటనే స్పందించి ఏలూరు డిపో నుంచి ధర్మాజీ గూడెం, చెక్కపల్లి,వలసపల్లి తదితర గ్రామాల మీదుగా బస్సును నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల విద్యా హక్కును గుర్తించి సమయోచితంగా స్పందించిన ఆర్టీసీ చైర్మన్ అప్పలనాయుడు కికృతజ్ఞతలు తెలుపుతూ, వచ్చే సోమవారం నుంచి నడపనున్నఈ కొత్తబస్సుకి విద్యార్థులు,ఆయా గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

విశాలాంధ్ర - భీమవరం : యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్ తో పాటు దేశ భవిష్యత్ నాశనమవుతుందని పలువురు వక్తలు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఈగల్ ఆధ్వర్యంలో మెప్మా మహిళలతో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ ప్రతిజ్ఞ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సేవించినా, కలిగి ఉన్నా చట్ట ప్రకారం నేరమన్నారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో విద్యన భ్యసించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కార్యా లయం నుంచి పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీవో ఆర్.రాజేష్, పీఏ బి.నహి మియా, ఓఆర్ డబ్ల్యూ పి.వెంకటేష్, వరల్డ్ హ్యూమన్ రైట్స్ ఏపీ చైర్మన్ పర్రిపాటి శ్రీనివాస్, ఈగల్ అడ్వై జర్ చెరుకువాడ రంగసాయి, మెప్మా సిఎంఎం కె.సుధాకర్ రావు, జయకృష్ణ, కానిస్టేబుల్స్ కే.మురళీ, ఆర్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకట సుబ్బరాజుకు సత్కారం

విశాలాంధ్ర - కాళ్ల : పనిచేసిన గ్రామంలో తల్లిదండ్రులు, గ్రామస్తుల అభిమానం పొందడం ఉపాధ్యాయులకు గొప్ప గౌరవం అని మండల విద్యాశాఖ అధికారి రవీంద్ర అన్నారు. బుధవారం మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలిలో ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వహించి పీఎస్ హెచ్ఎంగా పదోన్నతి పొందిన అద్దాల వెంకట సుబ్బరాజుకు జరిగిన అభినందన సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మనబడి నాడు నేడులో బడిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సుబ్బరాజు సేవలను గ్రామస్తులు కొనియాడారు. సుబ్బరాజును ఘనంగా సత్కరించారు. మండల విద్యా శాఖ అధికారి ఎ.రవీంద్ర , గ్రామ సర్పంచ్ శ్రీమతి బి ధనలక్ష్మి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, గ్రామ పెద్ద నూకల భోగేంద్రబాబు, ఎస్ ఎం సి చైర్మన్ టి. అశోక్ బాబు, పాఠశాల ప్రధా నోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు బిఆర్ఎంకె స్వామి, విజయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్కారు బడులు.. సమస్యలకు నిలయం

- పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి....
- సీపీఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య

విశాలాంధ్ర - కుక్కునూరు: కుక్కునూరు ఏజెన్సీ మండలంలోని సర్కారు బడులు సమస్యలకు నిలయాలుగా మారాయని సీపీఐ పోల వరం నియోజకవర్గం కార్యదర్శి కారం దారయ్య విమర్శించారు. బుధవారం సీపీఐ శ్రేణుల ఆధ్వర్యంలో మండలంలో పలు పాఠశా లలను పరిశీలించారు. అనంత రం కుక్కునూరు సీపీఐ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కారు బడుల్లో టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తుందని వెల్లడించారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారం భంలోనే మండలంలోని పలు పాఠ శాలలో పనిచేస్తున్న టీచర్లు బదిలీపై వెళ్లినా తిరిగి ఖాళీగా ఉన్న పోస్టు లను భర్తీ చేయడంలో విద్యాశాఖ ఎందుకు అలసత్వం వహిస్తుందని ప్రశ్నించారు.టీచర్ల లేకపోవడంతో పిల్లల చదువులు అగమ్యగోచరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుక్కునూరు మండలంలో ఉన్న 41 ప్రభుత్వ పాఠశాల్లో 114 మంది టీచర్ల పోస్టులు ఉండగా రెగ్యులర్ టీచర్లు 20 మంది డిప్యుటే షన్ పై మరో 18 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 76 మంది టీచర్ల పోస్టులను తక్షణమే అధికారులు భర్తీ చేపట్టాలని డిమాం డ్ చేశారు. మండలంలోని రాయి గూడెం,ఉప్పేరు,చీరవల్లి, రామసిం గారం సెంటర్లలో ఉన్న 4 మోడల్ పాఠశాలల్లో 26 మంది టీచర్లకు కేవలం 8 మంది టీచర్లతోనే పిల్లల చదువులు సాగుతున్నాయని తెలిపారు. కొన్ని చోట్ల ఒక్క టీచర్ తోనే పాఠశాల కొనసాగడం దయనీయ మని దారయ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత ఉండటంతో తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపడానికి మొగ్గు చూపుతున్నారన్నారు. విద్యా శాఖ తక్షణమే ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను భర్తీ చేసి పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ కుక్కు నూరు మండల సమితి కార్య దర్శి లక్ష్మయ్య,సహాయ కార్యదర్శి కూరా కుల బాబూరావు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయాలని విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - ఏలూరు: సీపీఐ ఏలూరు జిల్లా 2వ మహాసభలు జయప్రదం చేయాలని పెదపాడు మండలంలోని గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ మండల ఇన్చార్జి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ వందలలో ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం వారి హక్కులను కాపాడడం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాలను ఉద్యమాలను స్మరించుకుంటూ సిపిఐ ఏలూరు జిల్లా 2వ మహాసభలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.జూలై 5,6,7,తేదీలలో చింతలపూడి పట్టణంలో జరుగుతున్న జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వెదురుపర్తి శారద, లక్కోజు జగదీశ్వరి, అరుణ, కుమారి, నాగరత్నం పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

విశాలాంధ్ర -భీమవరం: స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్స్ లో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరి శీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమ క్షంలో ప్రతి మూడు నెలలకి ఒక సారి ఈవీఎంలు భద్రపరిచిన గోడౌ న్ క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పం పడం జరుగుతుందని తెలిపారు. ఈవీఎం గోడౌను వద్ద విధులు నిర్వ హిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాల న్నారు. డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా ఫైర్ ఆఫీసర్ బి.శ్రీని వాసరావు, ఎలక్షన్ సెక్షన్ ఇంచార్జి సూపరింటెండెంట్ మరాపు సన్యాసిరావు, టీడీపీ ప్రతినిధి మరపట్ల శ్యాంబాబు, జనసేన ప్రతినిధి బి.జయ శివ ఉన్నారు.

దేశీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర ఏలూరు: భారతీయ ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలు పెరుగుతున్నాయని,ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభిస్తోందని శాసన మండలి సభ్యులు వంక రవీంద్ర నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరుగుతున్న అంతర్జాతీయ టెక్స్ టైల్ ఎగ్జిబిషన్‌లో ఇండియన్ పెవిలియన్ స్టాల్స్ ను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టెక్స్ టైల్స్ అభివృద్ధి కోసం ఇండియా అనేక చర్యలు తీసుకుంటోందని,బంగ్లాదేశ్ ఇండియా పరస్పర సహకారం ఈ రంగాన్ని బలోపేతం చేస్తుందని,దానికి ఇరుదేశాల మధ్య సహకారం సంబంధాలు మరింత బలోపేతం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ డైరెక్టర్ అ బాలకృష్ణ, అలోక్,స్కైర్ కార్పొరేషన్,దామోదరం ఇండస్ట్రీస్ తదితరం సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆంధ్ర ప్రదేశ్ నుండి రవళి స్పిన్నర్ల డైరెక్టర్ సింహాద్రి రవళి పాల్గొన్నారు.ఇండియా ఇతర రాష్ట్రాలనుంచి 22 ప్రముఖ కంపెనీలు వారి ఉత్పత్తులను ప్రదర్శించారు. చైనా, పాకిస్తాన్, వియత్నాం,ఇండోనేషియా నుండి 300 సంస్థలు ఈ అంతర్జాతీయ ఫెయిర్‌లో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆపదలో ఉన్న వారి కుటుంబాలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని టీడీపీ మండల అధ్యక్షులు పారేపల్లి నరేష్ పేర్కొన్నారు. మండలంలో రాజవరం గ్రామానికి చెందిన కాకర్లమూడి రాజేశ్వరరావు, నేరుసు దుర్గారావు, భీమడోలు శేషమ్మ, విజయలక్ష్మిలు ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్‌కు, ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, వెంటనే వీరి నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో రాజవరం గ్రామపం చాయతీ కార్యాలయం వద్ద రాజేశ్వరరావు, కు రూ.30వేలు, నేర్సు దుర్గరావు కు రూ.21వేలు, శేషమ్మకు రూ. 30వేలు, భీమడోలు విజయలక్ష్మి కి రూ.27వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాదపల్లి రాధాకృష్ణ,సుదగాని సత్యనారాయణ,కోన కుమార్, అనంతల శ్రీనివాస్,బచ్చు మోహన్ రావు, రాపోలు పతిరాజు,ఆరేటి ఏసు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ చోరీపై కేసు

విశాలాంధ్ర - టి నరసాపురం : మోటారు సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెడ్లం గ్రామ పంచాయతీలోని మరియపురం గ్రామానికి చెందిన కొడవటి శ్రీను ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5గంటల సమయంలో మరియపురంలోని తన యజమాని తుమ్మూరి రవీంద్రనాథ్ రెడ్డి ఇంటి ముందు హోండా షైన్ మోటారు సైకిల్ పార్కింగ్ చేసి వెళ్లి అరగంట తరువాత వచ్చి చూడగా గుర్తు తెలియని దొంగలు అపహరించినట్లు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని శ్రీను ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర -భీమవరం : ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియా విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో విద్యుత్ తీగలు మార్చిడి నిమిత్తం నేడు గురువారం ఉదయం 9 గం" నుండి సాయంత్రం 4 గం" వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. నరసయ్య అగ్రహారం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు సీపీఐ నియోజకవర్గ మహాసభ

విశాలాంధ్ర - నూజివీడు : ఈ నెల 27 శుక్రవారం నూజివీడు నియోజకవర్గం సీపీఐ మహాసభ నిర్వ హిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, నూజివీడు నియోజ కవర్గ కన్వీనర్ చలసాని వెంకటరామారావు తెలిపారు. ఈ మహాసభలో పార్టీ భవిష్యత్ కార్యక్రమాల గురించి చర్చించి ప్రజా సమస్యలపై ఉద్యమాల రూపకల్పన చేయడంతో పాటు నియోజకవర్గస్థాయి నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరుగుతుంది అని ఆయన పేర్కొన్నారు. సీపీఐ కార్యాలయంలో జరగనున్న ఈ మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవివి ప్రసాద్, అక్కినేని వనజ, ఏలూరు జిల్లా సిపిఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ సీనియర్ నాయ కులు కొమ్మన నాగేశ్వరరావు తదితరులు మహాసభకు హాజరు కానున్నారని రామారావు తెలిపారు. ఈ మహాసభకు పార్టీ నాయకత్వం ఎంపిక చేసిన ప్రతినిధులు తప్పకుండా హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శిగా బొద్దాని నాగరాజు

విశాలాంధ్ర - తణుకు: సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శిగా బొద్దాని నాగరాజు, కోశాధికారిగా గుబ్బల వెంకటేశ్వరరావు పట్టణ సమితి సభ్యులుగా బండి సత్యనారాయణ, పుట్టా అమ్మిరాజు, పెండ్యాల దత్తాత్రేయ ప్రసాద్, కట్టుంగ శంకర్, అత్తిలి శ్రీను, మం దుల ముత్యయ్య, బొద్దాని కృష్ణకిషోర్, సమ్మిరాజు, మందుల లక్ష్మి, గిద్దా అన్నపూర్ణ, బొద్దాని మురళీ కృష్ణ, కొంబత్తుల రవికుమార్, గార ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నాణ్యతలేని మాంసం విక్రయాలుపై చర్యలు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర-లింగపాలెం: నాణ్యతలేని మాంసం విక్రయాలు జరుగుతున్నాయని తెలియటంతో డిపిఓ అనురాధ స్పందించారు. ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమానికి ధర్మాజీగూడెం వచ్చిన ఈమె విశాలాంధ్రలో ప్రచురితమైన కథనంపై స్పందించారు. మేజర్ పంచాయతీ ధర్మాజీగూడెంలో మేకలు, గొర్రెలు,పశుమాంసం విక్రయాలలో నాణ్యత లోపించటం దీనిపై వినియోదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతుండటంతో విక్రయదారులపై చర్యలు తీసుకొనేందుకు కార్యచరణ చేపట్టారు. మాంసం విక్రయాలుకు సంబంధించి ఎంపీడీవో వాణి, డిప్యూటీ ఎంపీడీవో సుందరితో డిపిఓ చర్చించారు. మేజర్ పంచాయతీ ధర్మాజీగూడెంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలోని మాంసం విక్రయదారులకు ముందుగా నోటీసులు ఇవ్వాలని పంచాయితీ కార్యదర్శులను డిపిఓ ఆదేశించారు.మాంసం విక్రయాలు జరిగే ముందు జంతువులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులు నిర్దారించారు. నిబంధనల మేర మాంసం విక్రయదారులు నడుచుకోవాలని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నోటీసులు అందుకున్న మాంసం విక్రయదారులు లికిత పూర్వక సమాధానం ఇవ్వాలని తెలిపారు.

గ్రామాలలో ప్రత్యేక శానిటేషన్ : డీపీవో

విశాలాంధ్ర-లింగపాలెం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా మొదలుపెట్టినట్లు ఏలూరు జిల్లా డిపిఓ అనురాధ తెలిపారు. శానిటేషన్ ప్రత్యేక డ్రైవును లింగపాలెం మండలంలో డిపిఓ బుధవారం ప్రారంభించారు. ఉదయం7 గంటలకు మండలానికి చేరుకొని లింగపాలెం,యడవల్లి, ధర్మాజీగూడెంలో శానిటేషన్ పనులను, దంపింగ్ యార్డులను పరిశీలించారు. పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల ప్రకారం ప్రత్యేక శానిటేషన్ పనులను చేపట్టినట్లు డిపిఓ వివరించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో పంచాయితీ కార్యదర్శులు సిబ్బందితో పనులు చేయించాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం7గంటలకు కార్యదర్శులు గ్రామాలలో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఇంటింటికి చెత్త సేకరణ జరగాలని, తడి,పొడి చెత్తను విడివిడిగా దంపింగ్ యార్డుకు తరలించాలని అపరిశుభ్రత గ్రామాలలో కనిపించకూడదని అన్నారు. జిల్లాలో జరిగే శానిటేషన్ పనులపై నిత్యం అధికారుల పర్యవేక్షణ ఉంటుందని నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దంపింగ్ యార్డులను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. వసతులులేని దంపింగ్ యార్డులలో పంచాయతీలకు వచ్చే ఆదాయంతో వసతులు కల్పించుకోవాలని కార్యదర్శులకు సూచించారు.చెత్త ద్వారా సేంద్రీయ ఎరువులను తయారు చేయటం వల్ల రైతులకు ఈఎరువు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు.దంపింగ్ యార్డుల నుంచి జిల్లాలో ప్రతినెల దాదాపు పదివేల ఎకరాలకు సేంద్రియ ఎరువులు సరఫరా చేయవచ్చని డిపిఓ తెలిపారు. జిల్లాలో ఇంటి పన్నుల వసూళ్లలో గత ఏడాది కంటే ఈ ఏడాది11శాతం పురోగతి పెరిగిందని తెలిపారు.పన్నుల రూపంలో జిల్లాలోని పంచాయితీలకు రూ40 కోట్లు ఆదాయం రావాల్సి ఉండగా ఈ ఏడాది రూ33 కోట్లు వసూళ్ళు అయ్యాయని తెలిపారు. నూరు శాతం పన్నుల వసూలు జరిగేలా కార్యదర్శులు శ్రద్ధ చూపాలని సూచించారు. చెత్త సేకరణకు కావలసిన పరికరాలను, క్లాప్ మిత్రాలను కార్యదర్శులు సమకూర్చుకోవచ్చని అన్నారు. ఎంపీడీవో వాణి, డిప్యూటీ ఎంపీడీవో సుందరితో డీపీఓ చర్చించారు.

జూలై 9న దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె

- కార్పొరేషన్ కమిషనర్‌కు సమ్మె నోటీసు...
- ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బజంత్రీ శ్రీనివాసరావు...

విశాలాంధ్ర -ఏలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్‌కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీస్ చట్టం,షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టాలకు సవరణలు తెచ్చి రోజుకు 8 గంటల పని స్థానంలో 10 గంటలు పని విధానాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. సరైన రక్షణ,సౌకర్యాలు కల్పించకుండా మహిళలకు రాత్రి సమయాలలో పనిచేయించేందుకు యాజమాన్యాలకు స్వేచ్ఛ ఇస్తూ శ్రామిక మహిళల హక్కులను కాలరాసేలా చట్టంలో సవరణలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వ అడుగుజాడలలో నడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో తెచ్చిన సవరణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం తరపున సంక్షేమపథకాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగర కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ పారిశుధ్య పర్మినెంట్ కార్మికులకు యూనిఫారం, కుట్టుకూలీ, చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనె, తక్షణం అందజేయాలని కోరారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డిగర్ల నాగబాబు,ఏలూరు నగర అధ్యక్షులు యలగాడ దుర్గారావు, నగర కార్యనిర్వాహక అధ్యక్షులు యలగాడ శివకుమార్,యూనియన్ సభ్యులు గోవాడ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బుచ్చయ్య చౌదరిని విమర్శించే అర్హత వైసీపీకి లేదు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : టీడీపీ నేత బుచ్చయ్య చౌదరిని విమర్శించే అర్హత వైసీపీకి లేదని టీడీపీ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి హెచ్చరించారు. టీడీపీ సీనియర్ నాయకులు బుచ్చయ్య చౌదరిని నోరు పారేసుకుంటే నాలుక కోస్తామంటూ వైసీపీ పార్టీకి చెందిన బండి పుణ్యశీల వ్యాఖ్యలపై గంగిరెడ్ల మేఘలాదేవి మండిపడ్డారు.మేఘలాదేవి నివాసం వద్ద విలేకరులతో ఆమె మాట్లాడుతూ బుచ్చయ్య చౌదరి వంటి నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడిపై తన ఇష్టానుసారంగా పుణ్యశీల మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ నేతలు అంటేనే విచక్షణ లేకుండా మాట్లాడతారని వారి ఫ్యాన్ గాలి ఆమాదిరిగా వీస్తాదేమోనంటూ ఆమె చమత్కరించారు. హత్యా రాజకీయాలకు అడ్డాగా మార్చేసారని మళ్లీ సిగ్గులేకుండా పుణ్యశీల కూటమి నేతలపై దుర్మార్గంగా మాట్లాడుతున్న ఆమె తీరు పాపాత్మశీలగా రుజువు చేస్తుందని విమర్శించారు. చౌదరిపై మాట్లాడాలంటే వైసిపి నేతలంతా మరో జన్మఎత్తాలంటూ ఆమె స్పష్టం చేశారు. కూటమి నేతలపై అవాకులు చవాకులు పేడితే రాష్ట్ర టిడిపి మహిళలంతా సహించబోరని తగిన బుద్ధి చెప్పి తీరుతారని ఆమె హెచ్చరించారు. రాష్ట్రం అభివృద్ధి సంక్షేమంలో దూసుకుపోతుంటే వైసీపీ నేతలు అంత మాత్రం కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆమె విమర్శించారు.

సమస్యలు పరిష్కరించాలని రిలే నిరహార దీక్షలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ సానిటరీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని,పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏ.పి.మెడికల్ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. గత కొన్ని రోజులుగా జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నప్పటికి అధికారులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కనీసం స్పందించకపోవడంతో బుధవారం నుంచి విధులను బహిష్కరించి రిలే నిరాహార దీక్షకు పూనుకున్నామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు తెలిపారు. ఏరియా హాస్పిటల్ ఎదుట నిరాహారదీక్ష శిబిరం ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షులు జంపన వెంకటరమణ రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్ సానిటరీ వర్కర్స్ కి గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని , దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్‌కి పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని విధులు నిర్వహిస్తూ నిరసన వ్యక్తం చేశామని, కాంట్రాక్టర్, అధికారులు తమ నిరసనను పరిగణలోకి తీసుకోకుండా నిర్లక్ష్యంగా వహించడంతో విధులేని పరిస్థితిలో బుధవారం నుంచి విధులు బహిష్కరించి నిరాహార దీక్షకు పూనుకున్నామని తెలిపారు. చాలీచాలని వేతనాలతో కడు దుర్భరమైన పరిస్థితి ఎదుర్కొంటున్న పారిశుద్ధ కార్మికులకు, ప్రభుత్వానికి ఏజెన్సీల పేరిట దళారుల వ్యవస్థను కొనసాగించడం సహేతుకము కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన కాంట్రాక్ట్ ఏజెన్సీను తొలగించి ప్రభుత్వమే ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ దయాదాక్షిణ్యాలపై కార్మికుల జీవితాలు ఆధారపడి ఉన్నాయన్న విధంగా పరిస్థితి ఉందని,ఇది సరికాదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు ఇవ్వవలసిన మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షులు కూనపాముల విగ్నేష్ ఏఐటియుసి నాయకులు,వేముల రాజు,సంజీవ్, మేరీ, చంద్రకళ, దయామని, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంవిధాన్ హత్యా దివస్

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం చరిత్ర సోషల్వర్క్ శాఖల ఆధ్వర్యంలో 'సంవిధాన్ హత్య దివస్' పై అవగాహనా కార్యక్రమాన్ని కళాశాలలు నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అన్నారు. ఈ కార్యక్రమానికి ఆమె ఆధ్యక్షత వహించి, 1975 నుండి 1977 వరకు దేశంలో విధించబడిన ఎమర్జన్సీ గురించి, ఆనాడు జరిగిన సంఘటనలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె స్వరూపరాణి, చరిత్ర అధ్యాపకులు పి.భాస్కరరావు డాక్టర్ జి. వెంకట్రావు, డాక్టర్ జి. వెంకటరమణ, డాక్టర్ అనూరాధ, డాక్టర్ షేక్ పర్వీన్, షేక్ అన్సారీ, పి.వి. రమేష్ బాబు విద్యార్ధినీ, విదార్థులు పాల్గొన్నారు.

నిబద్ధతగా పని చేస్తా : పారేపల్లి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం :టిడిపి కోసం నిబద్ధతగా పనిచేస్తానని పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు పేర్కొన్నారు. దెందులూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులుగా తనను నియమించడంపై పారేపల్లి రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకి బాధ్యత అప్పగించిన తెదేపా జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, విద్యాశాఖ మంత్రి లోకేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో ఈ బాధ్యత అప్పగించినందుకు తను మరింత కష్టపడి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

29న ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సాయి రాకేష్ హై స్కూల్ ఏలూరు వైభవ్ ఆదర్శ లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ మెగా వైద్య శిబిరాన్ని ఈనెల 29వ తేదీ ఆదివారం సాయి రాకేష్ హై స్కూల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని, కొయ్యలగూడెం మండల పరిసర ప్రాంతాల ప్రజలు మెగా వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సాయి రాకేష్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్ఆర్ఆర్ నరసింహారాజు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

విశాలాంధ్ర,ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం సమకూరింది. ఏలూరుకి చెందిన నేమల రాము ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో బుధవారం జమ చేశారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్ దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలను, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర – అనపర్తి : పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రంగంపేట మండలం కొత్త వీరంపాలెంలో రూ.41 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు, జల జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.45.60 లక్షల నిధులతో నిర్మించే ఓవర్ హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్ వాటర్ ట్యాంకు, తాగునీటి కుళాయిలు, పైపులైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వీరంపాలెంపొకలలో రూ.43.20 లక్షల నిధులతో నిర్మించి ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్, తాగునీటి, పైప్ లైన్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పాత వీరంపాలెంలో రూ.9 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. పది లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈలకొలను శివారు అచ్యుతాపురంలో 12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రూ.25 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లమిల్లి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంటి నుంచి మైనర్ బాలిక పరార్

విశాలాంధ్ర – సీతానగరం: తల్లిదండ్రులు మందలించారు అనే కోపంతో మైనర్ బాలిక ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. దీనితో ఎస్ ఐ డి రామకుమార్ ప్రజల సహకారంతో బాలిక ఆచూకీ తెలుసుకొని బాలిక ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు మందలించారు అనే కోపంతో కడప జిల్లా పొద్దుటూరు గ్రామానికి చెందిన మైనర్ బాలిక పసల అర్పణ తండ్రి అరుణ్ బాబు(16) సీతానగరం గ్రామం వచ్చింది అని తెలుసుకొని గ్రామస్తుల సహకారంతో బాలిక ఆచూకీ తెలుసుకొని బాలిక వద్ద నుంచి ఆమె వివరాలను సేకరించడం జరిగిందన్నారు. తరువాత ఆ అమ్మాయికి కౌన్సిలింగ్ ఇచ్చి ఈ అమ్మాయి ఇక్కడ ఉంది అని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి బాలిక సంరక్షణ కొరకు రాజమండ్రి సి డబ్ల్యూ డికు పంపించడం జరిగిందన్నారు.

మోదీ పాలనలో రాజ్యాంగానికి తూట్లు

విశాలాంధ్ర కొవ్వూరు : నరేంద్ర మోదీ పాలనలో భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, మతం ద్వేషాలను రెచ్చగొడుతూ నియంత పాలన సాగిస్తున్నారని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి కే విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు బుధవారం కొవ్వూరు పట్టణంలోని విజయ విహార్ సెంటర్ నుండి ఎల్ఐసి మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు ప్రజాస్వామ్య సంరక్షణ రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నిరంకుశ పాలనపై కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో మత స్వేచ్ఛ హక్కును కల్పించడం జరిగిందన్నారు. భారతదేశంలో అన్నదమ్ములుగా కలిసి ఉండే హిందూ ముస్లిం క్రైస్తవులను విభజిస్తూ నేడు మోదీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని మత విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ ఉల్లా బేగ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో కల్పించబడిన రిజర్వేషన్లు రద్దు పరచేందుకు మోదీప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు శాఖ పుల్లారావు కొవ్వూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుచ్చు బాబు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకర కృష్ణారావు చాగల్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మట్ట సుబ్బారావు తాళ్లపూడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడమంచిలి చంద్రశేఖర్ కొవ్వూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ప్రసార కార్యదర్శి జొన్నకూటి రవికుమార్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర–తాళ్లపూడి : గోదావరి నది నుంచి ఇసుక తవ్వి రవాణా జరిగే క్రమంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు గురించి, రవాణాలో అక్రమాలు చోటు చేసుకున్నా, అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, స్టాక్ యార్డుల్లో ఇసుక విక్రయాలకు నిబంధనలు వర్తిస్తాయని కొవ్వూరు ఆర్డీవో రాణి సుష్మిత పేర్కొన్నారు. ఆమె ప్రక్కిలంక పంచాయతీ వద్ద జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. తాళ్లపూడి మండలం ప్రక్కిలంక రెవెన్యూ పరిధిలోకి వచ్చే 7.6 హెక్టార్ల లంక భూముల్లో మేటలు వేసిన ఇసుక డి.సిల్టేషన్ చేసేందుకు గాను ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కొవ్వూరు ఆర్డీఓ రాణి సుష్మిత అధ్యక్షతన భూగర్భ గనులుశాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలనుంచి అభ్యంతరాలను తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోతో పాటు తాళ్లపూడి తహసీల్దార్ లక్ష్మిలావణ్య, ఏడి ఫణి భూషనరెడ్డి, ఆర్.ఐ రామకృష్ణ, వీఆర్వో విజయకుమారి పాల్గొన్నారు..

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర –రాజమండ్రి సిటీ : రాజమండ్రిలోని ఆర్ట్స్ కళాశాల ముఖద్వార పనులు త్వరితగతిన పూర్తి చేయ్యాలని సిటీ ఎంఎల్ఏ ఆదిరెడ్డి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఆయన రుడా అధికారులు, పార్టీ నాయకులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. కళాశాలలో ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కళాశాల యాజమాన్యం ఎంఎల్ఏ ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమండ్రి చరిత్ర ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్న ఆర్ట్స్ కళాశాల ముఖద్వార పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చెయ్యాలని సూచించారు. వచ్చే నెల మూడో వారంలో మంత్రి నారా లోకేష్ రాజమండ్రి వచ్చే అవకాశం ఉందని ఆయన చేతుల మీదుగా కళాశాల ముఖద్వార ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. కళాశాల ఆవరణంలోని ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు .కళాశాల మైదానంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయ్యాలని రూడా అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఆయన వెంటన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

విశాలాంధ్ర – సీతానగరం: కేంద్ర కమిటీ జలజీవన్ మిషన్ పనులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండలంలో బుధవారం సింగవరం గ్రామ పంచాయతీ పరిధిలో నాగరత్న కాలనీలో కేంద్ర కమిటీ ముగ్గురు సభ్యులు డిప్యూటీ సెక్రటరీ, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ గరిమా కపూర్, టెక్నికల్ ఆఫీసర్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు లక్ష్మీ నారాయణ దామోదర్, టెక్నికల్ ఆఫీసర్ మన్నూజి ఉపాధ్యాయ సెంట్రల్ వాటర్ బోర్డు నుంచి వచ్చి క్షేత్ర స్థాయిలో జలజీవన్ మిషన్ పనులను తనిఖీ చేశారు. దీనిలో భాగంగా రూ.20.70 లక్షలతో గ్రామంలో చేసిన పనులు అయినా కుళాయి కనెక్షన్స్ పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడి వారి అభిప్రాయ సేకరణ చేశారు.ఎఫ్‌టికే కిట్లతో నీటి నాణ్యతను పరిక్షించే విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ సర్పంచ్ సంగన చినపోసియ్యతో కలిసి మొక్కలను నాటారు. గ్రామ స్థాయి వాటర్, శానిటేషన్ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ పరిశీలన అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో జలజీవన్ మిషన్ పనుల సంతృప్తి వ్యక్తం చేసి అధికారులను జరిగిన పనులు పై అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ గిరి, డి ఈ ఈ రవి కుమార్, ఏ ఈ ఈ ప్రకాష్, అవినాష్, కార్యదర్శి విజయ్ దుర్గా, సచివాలయం సిబ్బంది, ఆశా, ఏ ఎన్ ఎమ్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

లారీ స్వాధీనం

విశాలాంధ్ర–తాళ్లపూడి : ఎటువంటి బిల్లు లేకుండా రవాణా అవుతోన్న ఒక లారీని గజ్జరం గ్రామం వద్ద పట్టుకున్నట్లు కొవ్వూరు డివిజన్ టాస్క్ ఫోర్స్ ఏ.ఎస్.ఐ గంగాధరరావు తెలియ చేశారు. తాళ్లపూడికి చెందిన బోటుమెన్ సొసైటీ వద్ద లోడింగ్ చేసుకుని సుమారు 20 టన్నుల ఇసుకతో ఏపీ 39 యు.ఎం.003 నెంబర్ లారీని స్వాధీనం చేసుకుని తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. మైన్స్ డిపార్ట్మెంట్ అధికారులు దీనిపై కేసు నమోదు చేస్తారని తెలిపారు.

సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర–దేవరపల్లి: దేవరపల్లి మండలం లక్ష్మీపురం, పల్లంట్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులుకే కమల్ రాజ్, టి సంజన వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు , స్థానిక నాయకులు, గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కమల్ రాజ్ మాట్లాడుతూ సార్వా పంటలు వాటి సాగులో యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించడం జరిగిందన్నారు. రైతులు ఎక్కువగా మన పరిసర ప్రాంతాల ప్రజలు తినని రకాలు(పి ఆర్ 126, ఎస్ఎల్ 10) లేదా ఎగుమతి చేసే రకములకన్నా మనం తినే రకాలను (స్వర్ణ, పి.ఎల్ 1100) పండించవలసిందిగా రైతులకు సూచించారు. ప్రతి కౌలు రైతు సీసీఆర్సీ కార్డులు నమోదు చేసుకోవాల్సిందిగా వారికి వివరించారు. సీసీఆర్సీ కార్డు యొక్క ప్రయోజనాలు రైతులకు వివరించడం జరిగింది. సార్వా సీజన్‌కు సంబంధించి పంటను వేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవలసినదిగా రైతులకు ఆయన సూచించారు.

గోతులు పూడ్చివేత

విశాలాంధ్ర–తాళ్లపూడి : వైసీపీ నాయకులు, మండల జెసీఎస్ అధ్యక్షులు, ప్రక్కిలంక పంచాయతీ యాళ్ల బాబురావు చొరవతో ఆటో నగర్‌వద్ద ఆర్ అండ్ బి రోడ్ గోతులు పూడ్చివేత కార్యక్రమం చేపట్టారు. కొంత కాలం క్రితం మండల కేంద్రమైన తాళ్లపూడిలో ఆటో నగర్‌లో ఏర్పడ్డ గోతులు కారణంగా ప్రజలు నానా యాతనపడుతున్నారు. అనేక వాహనాలు గోతుల్లో పడి ప్రజలు ప్రమాదాల బారినపడ్డారు. దీంతో స్పందించిన వైసీపీ నాయకులు యాళ్ల బాబూరావు ప్రక్కిలంక పంచాయతీ కార్యదర్శి నంది రాజు, సర్పంచ్ స్వప్న దృష్టిలో పెట్టి గోతులు పూడ్చేందుకు వెట్‌మిక్స్ తెప్పించి వేయించారు. తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు పర్యవేక్షణలో నాయకులు యాళ్ల బాబూరావు చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల ప్రజలు కొంత కాలంగా ఎదుర్కొంటున్న సమస్య నుంచి పూరట కలిగింది.

విద్యాబోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర–దేవరపల్లి: బడి తరువాత విద్యాబోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం రామలక్ష్మి అన్నారు. దేవరపల్లి దేవిమండలం యర్నగూడెం మెయిన్ ఎలిమెంటరీ స్కూల్లో పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ నిర్వహించే బడితరువాత విద్యా బోధన శిక్షణ తరగతులను ప్రధానోపాధ్యాయిని రామలక్ష్మి ప్రారంభించారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు బడితరువాత విద్యా బోధనలు అందిస్తూ వారికి విద్యా సామాగ్రి ఇస్తూ మరింత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు దశాబ్ద కాలంగా కృషి చేస్తున్న పార్డ్ ఇండియా సంస్థ సేవలు అభినందనీయమని రామలక్ష్మి అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పలుచోట్ల పార్డ్ ఇండియా సంస్థ బడి తరువాత విద్యా బోధన నిర్వహిస్తుందని కార్యక్రమం విద్యార్థుల్లో మంచి ఫలితాలను అందిస్తుందని ఇర్కాన్ సంస్థ సహకారం అందిస్తుందని పార్డ్ ఇండియా వ్యవస్థాపకులు బీవీ స్వామి కార్యక్రమాన్ని మరింత విస్తృత పరిచేందుకు కృషి చేస్తున్నారని సంస్థ సభ్యులు సోమశెట్టి వెంకటరావు అన్నారు. ఉపాధ్యాయులు మహేష్ సుధాకర్ విష్ణు బేతాల నాగమణి సంస్థ సభ్యులు దేవరాజు అచ్చుతరావు ధూళిపూడి రవీంద్ర సత్యనారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా సురేష్ బాబు

విశాలాంధ్ర - కొత్తపేట : మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన సహాయ కమీషనరు, కార్యనిర్వాహణాధికారిగా డి సురేష్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని దర్శనాల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని గ్రామ ప్రజలను కలుపుకుని దేవస్థానం అభివృద్ధికి పాటు పడతానని తెలిపారు. దేవస్థానం విస్తృత ప్రచార మునకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులందరూ పూర్తి సహకారం అందించాలని కోరారు.

యాక్సియం 4 సక్సెస్ సంబరాలు

విశాలాంధ్ర - రాజోలు : నాసా చేపట్టిన యాక్సియం 4 మిషన్ విజయవంతం అయిన సందర్భంగా మలికిపురం మండలంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు జై భారత్ జై జై భారత్ అంటూ నినాదాలు చేసి స్కూల్ ప్రాంగణంలో హెూరెత్తించి దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ ప్రసాద్ వ్యోమగామి భారత వ్యోమగామి శుభాంశు శుక్లకు నాసా బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఆస్ట్రనాట్ శుభాంశు శుక్లా వేషధారణలో నిలిచి జై జైలు పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళ

విశాలాంధ్ర - కొత్తపేట : కొత్తపేట కాపు కళ్యాణ మండపం వద్ద శాసన సభ్యులు బండారు సత్యానందరావు పిలుపు మేరకు రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి వారు మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ చుట్టుప్రక్క ప్రాంత నిరుద్యోగ యువతి, యువకులు భారీగా పాల్గొన్నారు. ఈ జాబ్ మేళా నందు 11 కంపెనీలు జాబ్ మేళా నిర్వహించగా సుమారు 513 మంది పాల్గొనగా 192 మందికి సెలెక్ట్ అయ్యారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల బాబ్జి, గనిశెట్టి వీరేష్, బండారు సందీప్, బూసి జయలక్ష్మి భాస్కరావు, బీర ఇస్సాక్, యల్లమిల్లి జగన్మోహన్, ధరాణాల రామకృష్ణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మహిళ సాధికారతతోనే స్వపరిపాలన'

విశాలాంధ్ర - సామర్లకోట : "మహిళ సాధికారతతోనే స్వపరిపాలన" అన్న అంశంతో సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన 3 రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ఘనంగా ముగిసింది. రాజమండ్రి డివిజన్‌లోని మహిళా సర్పంచులకు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో పలువురు సర్పంచిలు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఉపయోగకరంగా ఉండే పరిపాలన సంబంధ విషయాలు తమకు అర్థమయ్యేలా వివరించినట్టు చెప్పారు. ఈ శిక్షణ ద్వారా గ్రామ అభివృద్ధిలో తాము సైతం అంటూ ముందడుగు వేస్తామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణ ముగింపులో భాగంగా సర్పంచులకు ప్రిన్సిపాల్ ప్రసాద్ చేతులమీదుగా సర్టిఫికెట్ల ప్రధానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి రమణ, కోర్స్ కో ఆర్డినేటర్ కె సుశీల, సీనియర్ ఫ్యాకల్టీ ఎస్ఎస్ శర్మ, అందరు ఫాకల్టీ, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం :ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కడియం: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బుధవారం ఆయన కడియం మండలంలోని అనేక గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. వేమగిరిలో రూరల్ మార్కెటింగ్ డైరెక్టర్, జనసేన నాయకులు జంగా వినోద్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. వేమగిరి గట్టు వద్ద సుమారు రూ.30 లక్షల నిధులతో పొట్టిలంకలో రూ.25 లక్షలతో సిసి డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసారు. మురమండలో రూ.30 లక్షలతో, జేగురుపాడులో రూ.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు గోరంట్ల శంకుస్థాపనలు చేశారు. దుళ్ల శివాలయం వద్ద రూ.40 లక్షలతో మురమండ రోడ్డులో బీసీ కాలనీ వద్ద రూ.37 లక్షలతో సీసీ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా దుళ్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గుర్రపు కొండయ్య మాష్టారు అధ్యక్షతన జరిగిన కూటమి సభలో ఎమ్మెల్యే గోరంట్లతో పాటు ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మాజీ ఎంపీపీ మార్గాని సత్య నారాయణ, అన్నందేవుల చంటి, మాజీ సర్పంచ్ కొండయ్య మాష్టారు , మండల తెలుగు యువత అధ్యక్షుడు ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, కూటమి నాయకులు బోడపాటి గోపి, ఆదిమూలం సాయిబాబా తదితరులు ప్రసంగించారు. దుళ్ల ప్రభుత్వ పాఠశాల నుండి ట్రిబుల్ ఐటీ కి ఎంపికైన విద్య శ్రీని ఎమ్మెల్యే అభినందించారు. అదేవిధంగా దుళ్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు వెలుగుబంటి నాని, సర్పంచ్ లు కొండపల్లి పట్టియ్య, పాఠంశెట్టి రాంజీ, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆంగ్లేయుల పాలన మించిన నిరంకుశ పాలన : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజానగరం : భారతదేశ ఔనిత్యాన్ని హరింప జేసి, తన స్వార్థం కోసం ఆంగ్లేయుల పాలన మించిన నిరంకుశ పాలన అందించిన ప్రధానిగా ఇందిరా గాంధీ చరిత్రలో నిలిచిపోయారని అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షులు పీక్కి నాగేంద్ర అధ్యక్షతన మండలంలోని గైట్ కళాశాల ప్రాంగణంలో 1975లో కాంగ్రెస్ పార్టీ విధించిన అత్యవసర పరిస్థితి చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు అనే అంశంపై విద్యార్థులతో బుధవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యాన్ని హరిస్తూ దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన ఆ నాటి పరిస్థితిపై నేటి యువతకు అవగాహన ఎంతో అవసరమన్నారు. ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వతంత్రం లభిస్తే, అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తన స్వార్థం కోసం నిరంకుశ పద్ధతిలో 1975 జూన్ 25 న అర్ధరాత్రి నుండి దేశ వ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించి ప్రజలను,ప్రతిపక్ష నాయకులను,పత్రిక విలేకర్లును అనేక ఇబ్బందులు గురి చేశారని చెప్పారు. ఆ నాటి పరిస్థితిలను నేటి విద్యార్థులకు వివరించేందుకు దేశ వ్యాప్తంగా వివిధ కళాశాలల్లో బీజేపీ నేతృత్వంలో సమావేశాలు నిర్వహిస్తుందన్నారు.మరో అతిథిగా విచ్చేసిన ఆర్ఎస్ ఎస్ ప్రాంతీయ కార్యవరక్ ప్రముక్ వోలేటి సత్యనారా యణ మాట్లాడుతూ ఆ నాటి ప్రధాని ఇందిరా గాంధీ నియంతల వ్యవహరిస్తే ప్రజాసామ్య పరిరక్షణ కోసం ఎమర్జెన్సీ పరిమాణలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా లక్ష ముప్పై వేల మంది జైలుకు వెళ్లారని చెప్పారు. వారిలో తాను కూడా ఒకడ్ని అని రాజమండ్రి సెంట్రల్ జైలులో నాలుగు నెలలు జైలు శిక్ష అనుభవించామాని అన్నారు. .అనంతరం జిల్లా నుండి నాడు జైలుకు వెళ్లిన మహంకాళి రామకృష్ణ, ఓలేటి సత్యనారాయణ,నండూరి పార్థ సారధి, సీత వెంకటేశ్వర్లు, నలమాటి లక్ష్మీపతి, కనకరాల కోటేశ్వరరావు, పట్టాబి రామయ్య లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జ్ పి.రామ్మోహనరావు, రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా కో కన్వీనర్ జి.వెంకట రత్నా రెడ్డి,రాజానగరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి,కో కన్వీనర్ అడబాల గణపతిరావు, బీజేపీ మండల అధ్యక్షులు ఆళ్ల శివ నాగరాజు,అసెంబ్లీ కో కన్వీనర్ అడబాల గణపతి రావు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు మోది సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బృందం మధ్యాహ్న భోజనం పరిశీలన

విశాలాంధ్ర - పిఠాపురం : పట్టణంపరిధిలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని పిఠాపురం పట్టణ సిపిఐ బృందం స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం పరిశీలించారు. ఉపాధ్యాయులు పిల్లలతో భోజనం గురించి వివరాలు అడిగి తెలుసుకొని, విద్యార్థులతో కలిసి స్వయంగా భోజనం చేసారు. అనంతరం సిపిఐ నాయకుడు సాకా రామకృష్ణ పాత్రికేయులతో మాట్లాడుతూ చదివే పిల్లలకు ఎదిగే పిల్లలకు పౌష్టికాహారం చాలా అవసరం అని పౌష్టికాహారం అందించడం వల్ల చదువుల్లో చురుకుదనం ఏర్పడుతుందన్నారు. వారంరోజులుగా సన్నబియ్యం భోజనం అమలైనట్లుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు చెబుతున్నారని, ఈ సన్నబియ్యం భోజనం కంటిన్యూ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తల్లికి వందనం చాలామంది విద్యార్థులకు పడక ఆవేదన చెందుతున్నారని ప్రభుత్వం చర్యలు తీసుకుని తక్షణమే ఖాతాలో వెయ్యాలని, అలాగే కాలేజీలో చదివే యువతీ యువకులకు పీజు రీయింబర్స్మెంట్ పడలేదని దానిమీద విద్యార్థులపై వత్తిళ్ళుఉంటున్నాయని, తక్షణమే మంజూరు చేయాలన్నారు. అలాగే నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ఎన్నికల హామీ అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేసబోయిన గోవిందు మూర్త నాగేశ్వరరావు, కొప్పిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హుండీ చోరీ దొంగలు అరెస్టు

విశాలాంధ్ర - కడియం : మండల కేంద్రమైన కడియం గ్రామంలో పోస్ట్ ఆఫీస్ వీధిలో గల పెద్ద వినాయకుడి గుడిలో గల హుండీని మే 31, తేదీ రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు ఆలయ కమిటీ సభ్యులు కడియం పోలీస్ స్టేషన్లో చేసిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసారు. కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం కడియం దేవి సెంటర్‌లో అనుమానంగా తిరుగుతున్న, రాజమహేం ద్రవరం కు చెందిన కసినికోట బాల పోసి గణేష్ (21) మైనర్ బాలుడైన గుర్రాల సిద్ధార్థ (15) లను అరెస్టు చేసి కోర్టుకు పంపినట్లు ఎస్ఐ బి నాగ దుర్గాప్రసాద్ తెలిపారు.

పీఎం డిఏజెబి అభియాన్‌పై అవగాహన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని పాండవులపాలెం, బవురువాక సబ్ ప్లాన్ గిరిజన గ్రామాల్లో ప్రధానమంత్రి ధర్తీ ఆబ భగీదరి అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు, తహసీల్దార్ ఎం సూర్యప్రభ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ డిస్టిక్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎన్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. ఈ గ్రామ సభలో పీఎం డిఏజెబి అభియాన్ పథకం కింద గిరిజన గ్రామాల్లో విద్యా సమాచారం కమ్యూనికేషన్ అభివృద్ధి పథకాలకు అమలుపై అవగాహన కల్పించేందుకు ఈ గ్రామ సభలు నిర్వహించారు. గిరిజనులు తమ అవసరాలను అధికారులకు నివేదించారు. అలాగే మా గ్రామాల్ని ఐటీడీఏ పరిధిలోకి కలపాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమార్ బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న పీఎం ఉజ్వల, వఎఫ్ఆర్ఏ, పీఎం జంధన్, ఆయుష్ బా, తదితర పథకాలపై అవగాహన కలిగించారు. తహసిల్దారు సూర్యప్రభ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, గిరిజనులకు మేలైన సేవలు అందించేందుకు అధికారి యంత్రాంగం ఎప్పుడు సిద్ధంగా ఉంటుంది అన్నారు. మెడికల్ క్యాంపులు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు గుమ్మడి రామలక్ష్మి అన్నవరం, దొడ్డి సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథ్, ఆర్డబ్ల్యూఎస్ జేఈ జిఎస్ లక్ష్మి, పిఆర్ జెఈ ఏం సత్య ప్రకాష్, ఏపీవో కుమార్ స్వామి, ఎంఈఓ రాజబాబు, పెద్దిపాలెం పిహెచ్సి వైద్యాధికారి కె యశ్వంత్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అధినేత జగన్‌తో మురళి రాజు భేటీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మాజీ సీఎం, వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డితో ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో భేటీ అయ్యారు. మురళి రాజు పరిశీలకునిగా వ్యవహరిస్తున్న నరసాపురం పార్లమెంట్లో పార్టీ చేస్తున్న కార్యక్రమాలు విధివిధానాలపై అధినేత జగన్‌కు వివరించడం జరిగిందని ఆయన తెలిపారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర వైసిపి నేతలకు అధినేత జగన్ నిర్వహించడం జరిగిందని దీనిలో పార్టీ రానున్న కాలంలో ప్రజా పక్షంగా వ్యవహరిస్తూ చేయాల్సిన పార్టీ కార్యక్రమాలు పై దిశ నిర్దేశం చేయడం జరిగిందన్నారు.

నిందితులకు రిమాండ్

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలం అంబేద్కర్ కోనసీమ జిల్లా వడ్లమూరు గ్రామంలో హత్యాయత్నం కేసులో ముద్దాయిలకు ఐదుగురికి రిమాండ్. ఈ నెల 22 రాత్రి 08.30 గంటలకు వడ్లమూరు గ్రామంలో పాత గొడవలు నేపథ్యంలో కొంతమంది గ్రూపుగా ఏర్పడి ముగ్గురిని కొట్టగా అంగర పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా, రామచంద్రాపురం ఇన్చార్జ్ డీస్పీ అమలాపురం డీస్పీ ప్రసాద్, మండపేట రూరల్ సీఐ దొరరాజు మరియు అంగర ఎస్ఐజీ హరీష్ కుమార్ సంఘటన స్తలం పరిశీలించి, గొడవకు కారణం అయినా ఐదుగురు ముద్దాయిలను కొల్లాటి సురేష్ తదితకెలె పట్టుకుని ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్ట్ నందు ప్రవేశ పెట్టగా, ఆలమూరు కోర్ట్ వారు ముద్దయిలకు 15 రోజులు రాజముండ్రి సెంట్రల్ జైలుకు రిమాండ్ విదించినారు. శాంతిభద్రతలుకు విఘాతం కలిగిస్తే వారిపై క్రిమినల్ కేసులు కట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అనవసర గొడవలులో తల దూర్చి భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని అంగర ఎస్ఐ హరీష్ కుమార్ హెచ్చరించారు.

సీనియర్ జర్నలిస్టులకు ఆర్యవైశ్య సంఘం సత్కారం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ వాసవి ఫంక్షన్ హాల్‌లో జరిగిన సాధారణ సమావేశంలో భాగంగా పత్రికా రంగంలో ఉంటూ సంఘం చేసే పలు సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీయూడ బ్ల్యూజే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కాబడిన మండేల నాగ వెంకటప్రసాద్ (బాబీ)ని అలాగే ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా కొర్లపాటి ప్రదీప్‌ను సీనియర్ సిటిజన్స్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేసి ఆశీర్వదించారు, అనంతరం యెందూరి రాఘవ నాగేశ్వరరావు ఐ అండ్ బ్లడ్ బ్యాంకును నిర్వహిస్తున్న యెందూరి నాగేశ్వరరావు, రాఘవలను శాలువతో సత్కరించి పూలమాలలు వేసి అభి నందనలు తెలిపారు. ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసి యేషన్‌లో జీవిత సభ్యులుగా చేరిన యెందూరి నాగేశ్వర రావు, యెందూరి రాఘవ, గోళ్ళ శ్రీరామచంద్రమూర్తిలచే సంఘ ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన గోకవరపు మల్లిబాబుకి సంఘ సభ్యులు అందించిన ఐదువేల రూపాయల విరాళాన్ని అతనికి అందించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు(విస్సు), కార్యదర్శి నూలు సూర్య ప్రభాకర రావు(సూరిబాబు), కోశాధికారి శ్రీకాకోలపు రాంపండు, ముఖ్య సలహాదారుడు నంబూరి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీనివాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్య క్షుడు వరదా సూరిబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

పీజీఈసెట్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెంలో ఆదిత్య ఫార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఏపి పిజిఈసెట్-2025 రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలో అద్భుతమైన ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకుతో పాటుగా పలు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఆదిత్య ఫార్మసీ కళాశాల విద్యార్థిని మల్లిపాటి సుమిత్ర రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంక్ సాధించడంతో పాటు ఎం ఫార్మసీ మరియు ఎం టెక్ ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన నైపర్ జెఈఈ పరీక్షల్లో అర్హత సాధించినట్లు తెలియజేసారు. ఆదిత్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఏపి పిజిఈసెట్-2025లో మొత్తం 35 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఆదిత్య విద్యార్థులు సాధించిన ర్యాంకులు వరుసగా 12, 83, 92, 199, 239, 388, 388, 439, 492, 492, 500, 624, 692, 860, 1063, 1182, 1444, 1444, 1444, 1761, 1761, 1915, 2546, 2546, 2828, 2967. వంటి అత్యుత్తమ ర్యాంకులు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో విశిష్ట ప్రదర్శన కనబరిచిన విద్యార్థిని మల్లిపాటి సుమిత్ర, ఆమె తల్లిదండ్రులను ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డా. యన్ సతీష్ రెడ్డి సత్కరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ విజయానికి మద్దతుగా నిలిచిన కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపల్స్, బోధన సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా డి సతీష్ కుమార్ మరియు ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా కె రవిశంకర్ పాల్గొని విజేతలను అభినందించారు.

పరశురాముడికి పరామర్శ

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా. కిమ్స్ హాస్పిటల్‌లో గుండె సంబంధించిన సమస్యతో చికిత్స పొందుతున్న రాష్ట్ర మాలమహానాడు నాయకుడు పెయ్యల పరశురాముడుని మాజీ శాసనమండలి సభ్యులు కిమ్స్ హాస్పిటల్ చైర్మన్ కేవివి సత్యనారాయణ రాజు (చైతన్యరాజు) పరామర్శించారు. ప్రస్తుతం ఎలా ఉంది అని యోగక్షేమాలు అడిగి త్వరగా కోలుకోవాలన్నారు. మరియు పరశురాముడుకి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్స్‌కి సూచించారు. చైతన్యరాజు వెంట కిమ్స్ సీఏఓ రఘు ఉన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : అతిసార వ్యాధి నిరోధక అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం అతిసార వ్యాధి నిరోధక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల గుండా ఈ ర్యాలీని నిర్వహించిన అనంతరం ప్రధాన వైద్యురాలు ఎం సౌభాగ్య సరోజ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంతో త్రాగునీరు కలుషితమవ్వడం, ఈగలు వాలిన ఆహార పదార్థాలను తినడం కూడా కారణమని వైద్యులు పేర్కొన్నారు. అతిసార వ్యాధిని త్వరగా పరిష్కరించవచ్చని, భవిష్యత్‌లో రాకుండా నివారించుకోవచ్చని వారు అన్నారు. . ఈ వర్షాకాల సమయంలో మరిగించిన నీటిని తాగడం ఉత్తమమని తెలిపారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని అన్నారు. శిశువులకు, చిన్నపిల్లలకు వయస్సుకు తగ్గ ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు : రవీంద్ర

విశాలాంధ్ర - కాకినాడ : ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలను ది కాకినాడ కో- ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్ అందిస్తోందని ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 15.64 కోట్ల రూపాయలు నికర లాభం ఆర్జించిందని టౌన్ బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర తెలిపారు. రాష్ట్రంలో ఉన్న కో ఆపరేటివ్ బ్యాంకుల్లో 46 బ్రాంచీలలో 1860 కోట్ల టర్నోవర్తో రెండవ స్థానంలో ఉందని వెల్లడించారు. బుధవారం టౌన్ బ్యాంక్ విలేకరు లతో సమావేశం కాకినాడలోని జయా రెసిడెన్సీ హోటల్లో జరిగింది. బ్యాంక్ 46వ వార్షిక ఆదాయం వివరా లకు సంబంధించి రవీంద్ర విలేకరులకు వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 31కి 1110.40 కోట్ల డిపాజిట్లు, 750.16 కోట్లు రుణాలు ఉన్నట్లు చెప్పారు. మార్చి 31 నాటికి 54 వేల 243 మంది సభ్యుల 29.37 కోట్లు వాటా ధనం కలిగి ఉందని అలాగే బ్యాంకుకు 184.56 కోట్లు సొంత నిధులు ఉన్నాయన్నారు. ఈ ఏడాది సభ్యులకు 12 శాతం డివిడెంట్ ఇచ్చేందుకు పాలకవర్గం ఆమోదించిందని చెప్పారు. బ్యాంకు గతంలో లాగానే ఈ ఏడాది కూడా ఏ గ్రేడ్ సాధించి ముందంజలో ఉందన్నారు. బ్యాంకు డిపాజిట్లు 1000 కోట్లు దాటడంతో రిజర్వ్ బ్యాంక్ టౌన్ బ్యాంకును టైర్ త్రీ స్థాయి బ్యాంకుగా గుర్తించిందని ఇది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ తర్వాత స్థానంలో ఉందన్నారు. రెండువేల కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యంగా బ్యాంకు పాలకవర్గం ముందుకు సాగుతోందని రవీంద్ర వెల్లడించారు. ప్రస్తుతం బ్యాంకు ఎనిమిది ఏటీఎంలు, ఒక క్యాష్ డిపాజిట్ మిషన్ ఏర్పాటు చేయగా ఆరు సొంత భవనాలు కలిగి ఉన్నాయన్నారు. నిర్వహణలో లేని ఖాతాల సొమ్మును గత ఏడాది మార్చి 31 నాటికి రూ.2.54 కోట్ల రిజర్వ్ బ్యాంకు ఖాతాకు పంపించినట్లు చెప్పారు. బ్యాంకు వైస్ చైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్, డైరెక్టర్లు సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, కంటిపూడి సత్యనారాయణ, అయ్యగారి వెంకటేష్, ఎండి సుధీర్ కుమార్ సీఈవో ని సుగుణ రావు, బోర్డు మేనేజ్మెంట్ సభ్యులు నల్లమిల్లి జనార్దన రెడ్డి, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

విశాలాంధ్ర - అమలాపురం : ప్రతీ శనివారం వాడపల్లికి కోనసీమ జిల్లాలోని అమలాపురం, రావులపాలెం మరియు చుట్టుప్రక్కల గ్రామాల నుండి, అంతేకాకుండా దూరప్రాంతాల నుండి వెంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ కోనసీమ జిల్లాలోని అన్ని డిపోల నుండి 22 ప్రత్యేక బస్సు సర్వీసుల తోపాటు, ఇవే కాకుండా రావులపాలెం నుంచి వాడపల్లికి మాత్రమే 8 బస్సులతో, 104 ట్రిపులతో ప్రతీ 15 నిమిషాలకు , ఇతర జిల్లాల నుంచి వచ్చు బస్సులతో కలిపి సుమారుగా 96 బస్సులు ఆపరేట్ చేయుట జరుగుచున్నది జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రవాణా అధికారి డి శ్రీనివాసరావు సూచన మేరకు ప్రయాణికుల సౌకర్యార్థం రావులపాలెం నుంచి వాడపల్లికి ప్రతీ 10 నిమిషాలకు బస్సు ఉండే రీతిన మరిన్ని అదనపు బస్సులు ఏర్పాటు చేయటం జరిగిందని, ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్ని ఆశ్రయించకుండా ఈ సదవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా ఎస్టిపి రాఘవకుమార్, జిల్లా ప్రజా రవాణాధికారి తెలిపారు.

ఎన్‌సీసీ వార్షిక ట్రైనింగ్ క్యాంప్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 18 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కాకినాడ ఆధ్వర్యంలో ఎన్‌సిసి వార్షిక ట్రైనింగ్ క్యాంపు (ఈ నెల 22 నుంచి జూలై 1 వరకు) ఉత్సాహంగా జరుగుతుందని, క్యాంప్ కమాండెంట్ మేజర్ కె మహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో మేజర్ ఆసిఫ్ మాట్లాడుతూ ఎన్‌సిసి ట్రైనింగ్ క్యాంపులో విద్యార్థులకు క్రమశిక్షణ, రైఫిల్ వినియోగం, డ్రిల్, మ్యాప్ రీడింగ్, దేశభక్తి, ఆరోగ్యం పరిశుభ్రత, నాయకత్వ లక్షణాలు వంటి వివిధ అంశాలపై ఈ పది రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుంది. అదేవిధంగా విద్యార్థులు త్రివిధ దళాలలో జాయిన్ అయ్యే విధంగా ఆసక్తిని రేపటం జరుగుతుందని తెలిపారు. ట్రైనింగ్‌లో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్లు డ్రోన్ టెక్నాలజీ మీద ప్రత్యేక ఉపన్యాసాలు ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులకు వ్యాయామం క్రీడలు యోగ మీద ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి విద్యార్థులు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందిం చుకునే విధంగా శిక్షణ ఇవ్వబడుతుంది. సుబేదార్ మేజర్ హేమంత్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన 550 క్యాడెట్లు, ఎన్‌సిసి ఆఫీసర్స్, పీఐ స్టాఫ్ పాల్గొన్నారు.

బాధితుడుకి ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - ఆలమూరు : కొత్తపేట మండలం వాడపాలెంకు చెందిన అమలా పురపు వీరభద్రం గత కొన్నాళ్లుగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నారు. లివర్ మార్పిడి చికిత్స నిమిత్తం రూ. 35లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలియజేశారు. వీరభద్రం వైద్యఖర్చుల నిమిత్తం మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు రూ.50వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో అమలాపురపు నితీష్, మల్లవరపు మల్లేశ్వరరావు, పసలపూడి మెహర్ బాబా, మండ ఫణీంద్ర, శ్రీను, పాండ్రకుల నాగసురేష్, అమరనాథ్, సత్యనారాయణ, గణేష్, శివాజీ, పసలపూడి వీరన్న, సత్యనారాయణ, రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మాజీరావు, మల్లవరపు సత్యనారాయణ, నాగేశ్వరరావు, ర్యాలీ రాఘవ పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలంలోని 18 గ్రామాలకు టీడీపీకి సంబంధించిన గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక పూర్తయినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావులు బుధవారం వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన గ్రామ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల వివరాలను వారు ప్రకటించారు. మడికి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా దొండపాటి సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శిగా కుడెలి సత్తిబాబు, చెముడులంక గ్రామ తెదేపా అధ్యక్షునిగా కొత్తపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గుండుమల్ల వీర వెంకట రామారావు, చొప్పెల్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా మద్ది సతీష్, ప్రధాన కార్యదర్శిగా వెన్నా భీమశంకరం, నర్సిపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా రాయుడు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా పలివెల రామకృష్ణ, మోదుకూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా దాయని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎడ్లపల్లి నాగేంద్ర, గుమ్మిలేరు గ్రామ తెదేపా అధ్యక్షునిగా యాదగని సత్యనారాయణ ప్రధాన కార్యదర్శిగా కడియాల రామకృష్ణ, పెదపళ్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా నామాల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా పిల్లి సతీష్ కుమార్, పినపళ్ళ గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కొత్తూరి శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పిల్లి సురేష్, సంధిపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా సూరంపూడి పట్టాభి, ప్రధాన కార్యదర్శిగా గుబ్బల గోపి, చింతలూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా వైట్ల గంగరాజు, ప్రధాన కార్యదర్శిగా మట్టా రామకృష్ణ, సూర్యారావుపేట గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కాలా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నేదేడుమిల్లి దుర్గారావు, ఆలమూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ఈదల రామారావు, ప్రధాన కార్యదర్శిగా కేత రాంబాబు, కలవచర్ల గ్రామ తెదేపా అధ్యక్షునిగా అనదాసు బూరయ్య, ప్రధాన కార్యదర్శిగా కోలపర్తి సురేష్, పెనికేరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా గొడవర్తి సూర్య భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా గుత్తుల శ్రీకృష్ణ నారాయణమూర్తి, నవాబుపేట గ్రామ తెదేపా అధ్యక్షునిగా నామాల వివి సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బొక్కా దుర్గాప్రసాద్, బడుగువానిలంక గ్రామ టీడీపీ అధ్యక్షు వగా పాలూరి గోవిందరాజు, ప్రధాన కార్యదర్శిగా అన్నందేవుల నాగేంద్రబాబు, మూలస్థానం గ్రామ తెదేపా అధ్యక్షునిగా గానుగుల సూరన్న, ప్రధాన కార్యదర్శిగా ఇలా చిన్న ఆంజనేయులు, జొన్నాడ గ్రామ తెదేపా అధ్యక్షునిగా గుత్తుల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నెక్కంటి వీరబాబు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన గ్రామ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను టీడీపీ నాయకులు అభినందించారు.

11 కేవీ విద్యుత్ తీగలతో ఇక్కట్లు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట బ్రౌన్ పేట శివారులో ఉన్న కందకు ఏరియా ఇండ్లపై 11 కెవి వైర్లు ఉండడం వల్ల తరచూ ప్రమాదం జరుగుతున్నాయని బ్రౌన్ పేటకు చెందిన ఏరియా ప్రజలు బుధవారం ట్రాన్స్‌కో సిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్‌కు మరియు ట్రాన్స్‌కో ఏ ఈ రమేష్ కుమార్ బుధవారం వినతిపత్రం సమర్పించారు. కందకు ఏరియా నివాసితులు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా తమ ఇండ్లపై 11 కెవి విద్యుత్ వైర్లు ఉండడంతో తరచూ ప్రమాదాలు ఏర్పడుతున్నాయని అన్నారు. విద్యుత్ వైర్లు ఇండ్లమీద నుంచి తొలగించి మాకు న్యాయం చేయాలని బ్రౌన్ పేట కందకం ఏరియా నివాసితులు బలిపే పల్లయమ్మ కొల్లి కుమారి ధనలక్ష్మి, గొల్లవిల్లి వీరన్న, రమణమ్మ, లక్ష్మి తదితరులు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించారు. దాంతో సంఘటన ప్రాంతాన్ని ట్రాన్స్కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్ మరియు ఏఈ పీ రమేష్ కుమార్‌లు విద్యుత్ వైర్లు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. తగిన చర్యలు తీసుకుని ఉన్న ఇళ్ళు యజమానులకు న్యాయం చేస్తామని ట్రాన్స్ఫర్ అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ అది సంఘంలో బ్రౌన్ పేటకు చెందిన కందకు ఏరియా ప్రజలు పాల్గొన్నారు.

తడి పొడి చెత్త పై అవగాహన

విశాలాంధ్ర - కరప : కరప మండలం పెద్దాపుర్పాడు గ్రామంలో తడి పొడి చెత్త సేకరణ పై గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగిందని డిప్యూటీ ఎంపీడీవో ఎస్ శ్రీనివాస రావు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావుతో కలిసి గ్రామంలో ఉన్న చెత్తను వేరువేరుగా సేకరించి ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రాలకు తరలించి సేంద్రీయ ఎరువులు తయారు చేయొచ్చని శ్రీనివాసరావు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై డేగ కన్ను : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : సమాజంలో జరిగే ఆ సాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. ఇందులో భాగంగానే ఇప్పటికే రహదారి ప్రమాదాల నివారణ కోసం డ్రోన్లను వినియోగిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు డయల్ 112 కాల్స్ పై వెంటనే స్పందించేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన 17 ద్విచక్ర వాహనాలను ఏలూరుకు అందించినట్లు వివరించారు. ఈ మేరకు బుధవారం ఏలూరులోని డిపిఓ కార్యాలయంలో ఆ వాహనాలను ఎస్పీ లాంఛనంగా ప్రారంభించి నగరంలో బుల్లెట్ పై ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి కిషోర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పర్యవేక్షించి ఉక్కుపాదం మోపేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, డయల్ 112 సేవలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం జిల్లాకు ప్రత్యేకంగా ద్విచక్ర వాహనాలు (హైటెక్ బైకులు) కేటాయించ బడ్డాయన్నారు. ఈ వాహనాల ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112 ద్వారా సమాచారం ఇచ్చిన నిమిషాల వ్యవధిలోనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు

తక్షణ సహాయం అందించడంలో పోలీస్ సిబ్బంది మరింత ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. అలాగే డ్రోన్ పర్యవేక్షణ ద్వారా ట్రాఫిక్ నియంత్రణతో పాటు అతివేగం నిరోధానికి మరియు రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నామన్నారు. రాత్రివేళ గస్తీలకు, చిన్న వీధులలో సులభంగా చొచ్చుకు పోవడానికి ఈ బైకులు ఉపయోగ పడతాయని చెప్పారు. అదే విధంగా వాహనాల్లో అమర్చిన కెమెరాలు, టెక్నాలజీ సపోర్ట్ ద్వారా సంఘటన స్థలాల ఫుటేజ్ ను నమోదు చేసి ఆధారాలు సేకరించడానికి వీలవుతుందన్నారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్. సూర్య చంద్రరావు, డిటిసి డిఎస్పి ప్రసాద్, ఏఆర్ డిఎస్పి చంద్రశేఖర్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ హబీబ్ భాషా, ఏలూరు త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ శానం రమేష్ బాబు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె

విశాలాంధ్ర -భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు అన్నారు. బుధవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల జెఎసి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎ.రాంబాబుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్ లకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పని స్థానంలో 10 గంటలు పని విధానాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. సరైన రక్షణ, సౌకర్యాలు కల్పించకుండా మహిళలకు రాత్రి సమయాల్లో విధులు కల్పించడం

దారుణమని విమర్శించారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని,కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మె లో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు, ఎఐసిటియు జిల్లా అధ్యక్షులు కొల్లాబత్తుల మహంకాళి, పెద్ద సంఖ్యలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి, ఎఐసిటియు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

విశాలాంధ్ర - రావులపాలెం : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అబ్యూస్, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రావులపాలెం టిఎస్ఎన్‌బి ఫంక్షన్ హాల్ నందు మాదక ద్రవ్యాలపై రావులపాలెం డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో రావులపాలెం టౌన్ సిఐ శేఖర్‌బాబు, కొత్తపేట ఎక్సైజ్ సిఐ కాత్యాయని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును ఛిద్రమయ్యేలా చేస్తున్నాయని అభంశుభం తెలియని విద్యార్థులు చిన్న వయస్సులోనే డ్రగ్స్‌కు బానిస అవుతున్నారన్నారు. ఈ ప్రమాదకర వ్యసనాలపై యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కొత్తపేట ఎక్సైజ్ సిఐ కాత్యాయిని మాట్లాడుతూ ఇంటర్నెట్ ద్వారా కూడా యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు అవుతున్నారన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అంతా కలిసి మాదకద్రవ్యాలపై అవగాహన పెంచాలని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీడీవోకు బెస్ట్ అవార్డు

విశాలాంధ్ర - ఆలమూరు : యోగ కార్యక్రమాలు నిర్వహణలో ఆలమూరు ఎంపీడీవో ఏ రాజుకు ఉత్తమ జిల్లా అవార్డు లభించింది. అవార్డును బుధవారం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఆర్డీవో శ్రీకర్ చేతులమీదుగా అందజేశారు. యోగ దే కార్యక్రమాల్లో భాగంగా గత నెల రోజులుగా ప్రభుత్వం యోగానిర్వాహనపై చేసిన సూచనలు సలహాలను తూచా తప్పకుండా అమలు చేయడంలో ఆలమూరు మండలం ముందంజలో ఉండడంతో ఈ కార్యక్రమాలు నిర్వహణ బాధ్యత వహించిన ఎంపీడీవో రాజును అభినందించి బెస్ట్ సర్వీస్ అవార్డును అందజేశారు. యోగా నిర్వహణలో బెస్ట్ అవార్డు స్వీకరించిన ఎంపీడీవో రాజును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావుతో పాటు కూటమి నాయకులు పలువురు అధికారులు అభినందించారు.

ఎమర్జెన్సీకి ఏభైఏళ్లు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : స్వతంత్ర భారతదేశ చరిత్రలో మరువలేని చీకటి అధ్యాయంగా నిలిచిన ఎమర్జెన్సీకి నేటికి ఏభైఏళ్ళు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా బీజేపీ ఆత్రేయపురం మండల అధ్యక్షుడు ఉమ్మిడిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1975 జూన్ 25న దేశంలో విధించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యంపై బలవంతపు దాడిగా అభివర్ణించారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సిఫారసుపై, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 (1) ప్రకారం, అంతర్గత కల్లోలాన్ని ఆజ్ఞలుగా చూపుతూ అప్పటి రాష్ట్రపతి ఫఖ్రుద్దీన్ అలీ అహ్మద్ ఎమర్జెన్సీని ప్రకటించారని తెలిపారు. దీని ఫలితంగా సుమారు లక్షమంది రాజకీయ నాయకులు, సామాన్యులు అరెస్టయ్యారని ఆరోపించారు. 21 నెలల పాటు దేశవ్యాప్తంగా భయభ్రాంతుల వాతావరణం నెలకొన్నదని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ బాధితుల త్యాగాలను కొత్త తరం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.

మంచి స్థలంలో బ్లైండ్ హోమ్ : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : అతి ముఖ్యమైన ప్రాంతంలో బ్లైండ్ హోమ్ ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఏ అవసరం ఉన్న పది నిమిషాలలో ఇక్కడికి వచ్చి సహాయం చేసేందుకు అవకాశం ఉంటుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి అన్నారు. బుధవారం కాకినాడ కర్లం జంక్షన్ సమీపంలో గల జిల్లా పరిషత్ సీఈవో బంగ్లా ఆధునికరించిన భవనాన్ని బ్లైండ్ హోమ్‌కు కేటాయించి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి మాట్లాడుతూ ఇంత మంచి ప్లేస్‌లో బ్లైండ్ హోమ్‌కి ఈ భవనాన్ని కేటాయించిన జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్‌కి, జిల్లా పరిషత్ సీఈవో వివిఎస్ లక్ష్మణ్ రావుకు జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ బిల్డింగును ఆధునికరించడానికి ఆర్థిక సహాయం చేసిన మాజీ ఐఏఎస్ అధికారి చల్ల భీమేశ్వరరావుకి వారి సతీమణి నిర్మలమ్మకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చల్ల భీమేశ్వరరావు 1958 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి అని ఆయన ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేశారని ఆయన సహోదయానికి నా ధన్యవాదాలు కలెక్టర్ అన్నారు. ఈ బ్లైండ్ హోమ్‌కు సిఎస్ఆర్ నిధులతో కోరమండల్ ఫెర్టిలైజర్స్ వారు మంచాలు, బెడ్లు, దిండ్లు,

ట్రంకు బాక్సులను సమకూర్చడం జరిగిందని వారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ భవనంలో ఐదు ఏసీలు అవసరం ఉందని వాటిని కూడా కోరమండల్ ఫెర్టిలైజర్స్ వారు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ భవనంలో 47 మంది ఉంటారని వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ భవనాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ భవనాన్ని ఆధునికరించడానికి ఆర్థిక సహాయం చేసిన మాజీ ఐఏఎస్ అధికారి చల్ల భీమేశ్వరరావు మాట్లాడుతూ విజువల్ ఇంపెడ్‌కు ఈ భవనాన్ని ఆధునికరించి ఇచ్చే అవకాశం రావడం చాలా అరుదు అని, ఇలాంటి అవకాశం నాకు ఇచ్చినందుకు కాకినాడ జిల్లా కలెక్టర్‌కి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. ఇలాంటి హోంలకు సహాయం చేయడం అంటే నాకు నేను చేసుకున్నట్లేనని భావిస్తానని ఆయన అన్నారు. ఇది నాయొక్క మనశ్శాంతి కోసం ఏదైనా చేయాలని తపనతో ఈ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అంధులతో ఆయన మాట్లాడి వారి యొక్క కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని, మానవత్వం ఎక్కువ ఉన్న సిబి రావుకి ధన్యవాదాలు తెలిపారు. .వీరికి ఏ అవసరం ఉన్న వారికి సహాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఆమె హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ ఈ అందులకు ఈ భవనం కేటాయించాలని జిల్లా కలెక్టర్ సంకల్పించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. కాకినాడ నగరానికి మధ్యలో ఈ భవనం ఉందని అన్నిటికీ అనుకూలమైన ప్రాంతమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ సంస్థ సెక్రటరీ వైడి రామారావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో జివిఎస్ రాంగోపాల్, కోరమండల్ ఫెర్టిలైజర్స్ సిఎస్ఆర్ సీనియర్ మేనేజర్ పి వంశీకృష్ణ, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడిఏవై శ్రీనివాసులు, లైన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డి రామ సుబ్రహ్మణ్యం, ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి, పలువురు అధికారులు, అందులు, దివ్యాంగులు పాల్గొన్నారు.